# పేరే దయితేనేం--?

## అదో పట్టణం

పట్టణం కాబట్టి లక్షపైగా జనాభా వున్నది. జనాభా వుంది కాబట్టి పది సినిమా హాళ్ళు వున్నాయి. బస్సులున్నాయి. మురికి కాలువలున్నాయి. కాలువల్లో ఆరోగ్యంగా పెరిగే దోమలున్నాయి. దోమలను పెంచి పోషించేందుకు మునిసిపాలిటీ వుంది. ఇంటికో జండా వుంది. వీధికో పార్టీ వుంది. హత్యలున్నాయి. మానభంగాలున్నాయి. మనుషులు అర్ధాంతరంగా మాయమై పోతున్నారు. ఇవేవీ జరక్కుండా శాంతి భద్రతలు కాపాడేందుకు ఓ పెద్ద పోలీస్ స్టేషనుంది. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ అని నాలుగు బ్రాంచి పోలీస్ స్టేషన్లున్నాయి.



ఇంతెందుకు- అదో పట్టణం అనటానికి కావలసిన హంగులూ... పొంగులన్నీ వున్నాయి. కాబట్టి అదో పట్టణం.

ఆ పట్టణం మధ్యలో పెద్ద సిఫ్టీ హోటలుంది. దానికి నక్షత్రాలు లేవు గాని ధరలు మాత్రం నక్షత్రాల లాగానే వుంటాయి.

ఆ హోటల్ పేరు మంగతాయారు.

దాని వోనర్ పేరు గంగరాజు.

పాతికేళ్ళ క్రితం గంగరాజు బికారి. దేశ దిమ్మరి. అణా కాని వాడు. ఇంకా చాలా...

మరి ఇప్పుడు?

ఆయనకు ఆ వూళ్లో నాలుగు చిన్న హోటళ్ళు, నాలుగు పెద్ద హోటళ్ళు వున్నాయి. ఆయన గుడ్లురిమితే కొందామన్నా ఎవరికీ పెసరట్టు దొరకదు. టీ కూడా అటకెక్కి కూచుంటుంది. అందుకే ఆ వూళ్లో ఆయనిచ్చే చందాల మీద బతుకుతున్న నాలుగైదు సాంస్కృతిక సంస్థలు 'హోటల్ కింగ్' అని ఆయనకు బిరుదు ప్రదానం కూడా చేశాయి.

ఇవే కాక రెండు రైస్ మిల్లులు వున్నాయి. రెండు దాల్ మిల్లులున్నాయి. రెండు ఆయిల్ మిల్లులున్నాయి. ఇంకా తెరవెనక అనేకానేక డీలింగులు, ఫిట్టింగులు, కట్టింగులు అన్నీ వున్నాయి.

ఈ వ్యాపారాలన్నీ చూసుకునేందుకు ఆయన నలుగురు అల్లుళ్ళను ఇల్లరికం తెచ్చుకున్నాడు. అందులో ఇద్దరు లాయర్లు, ఇద్దరు డాక్టర్లు.

"అమ్మో...! అదృష్టమంటే గంగరాజుది. కట్టు బట్టలతో వచ్చా డీవూరు. ఇప్పుడు చూడండి...! ఈ వూరినే కొనేలాగా తయారయ్యాడు" అనుకుంటారు అంతా.

పాతికేళ్ళ క్రితం ఆయన ముగ్గురు ఆడపిల్లలు, ఓ తలమాసిన చెల్లెలు, తల్లి, భార్య మొదలైన బలంగతో ఊరి మధ్య ఏ పుణ్యాత్ముడో పుణ్యాన్ని కొనుక్కునేందుకు కట్టిన ధర్మశాలలో దిగాడు.

అప్పట్లో ఆయన పిల్లల గొన్లు పోస్ట్ డబ్బాలు, తంకాయలు పీకేసిన తాటికాయలు. శరీరాలేమో అస్థి పంజరాలు. గంగరాజు తల్లి ఓపికుంటే ఏదైనా తినేది. ఓపిక లేకుండా ఖళ్ళు ఖళ్ళున దగ్గుతూ పడుకునేది. లేదంటే దగ్గటం కోసం 'ఆకలి' అని నోట్లో ఏదన్నా పెట్టుకునేది.

ఆయన భార్య మంగతాయారు అయితే, వున్న ఒక్క చీరని ఎవరూ చూడకుండా ఉతుక్కుని ఆరేసుకునేది. అదే చీరని అంచులు మార్చి కట్టుకునేది. గంగరాజు విషయానికొస్తే ఆయనకున్న ఆస్తి పైకండవా, పాత పడ్డ ధోవతి.

ఆ వూళ్లో అడుగడుగునా ఓ గుడి వుండడం చూసి 'ఆహా... ఇక్కడి ప్రజలకి దైవభక్తి మెండు' అనుకున్నాడు. ప్రతి వంద గజాలలో వున్న ప్రభుత్వ సారాయి దుకాణాలు చూసి 'ఓహో... ఇక్కడి ప్రజలు వ్యసనపరులన్న మాట' అని నిర్ధారించుకున్నాడు. అయితే ఎక్కువ మంది గుడిసెల్లో, కాలవగట్ల మీద పాకల్లో వుండడం చూసి 'ఆహా... ఇక్కడి ప్రజల్లో బీదరికం ఎంత ఎక్కువగా వుంది?' అనుకున్నాడు.

తాను అక్కడ ఏం చేయాలో, ఎలా బతకాలో అర్థం కాలేదు.

మూడు రాత్రులు, మూడు పగళ్ళు వూరి మీద పడి తిరుగుతుండగా ఆయనకు ఐడియా తట్టింది.

వెంటనే ధర్మశాలకు పరుగెత్తుకెళ్లి భార్యను పిలిచి అడిగాడు "మంగతాయారు... నీకు నా మీద నమ్మకముందా...?"

"అదేం మాటండీ? మీరు నా కోసం, పిల్లల కోసం ఎంత కష్టపడుతున్నారో నాకు మాత్రం తెలీదా... పాపిష్టిదాన్ని- నాకు మీ కష్టాల్లో పాలు పంచుకునే అదృష్టం లేకపోయే...!" అంది కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ మంగతాయారు.

"ఇప్పుడొచ్చింది ఆ అవకాశం. నా కష్టాల్లో పాలు పంచుకునే అవకాశాన్ని దేవుడు నీకిచ్చాడు. మరి నీవు మాత్రం నన్ను అపార్థం చేసుకోకూడదు...!"

"ఏంటది-?"

"నీ మెళ్ళో వున్నాయి చూడు పుస్తెలు- అవి అమ్మేసి ఏదైనా వ్యాపారం చేద్దాం...!"

మంగతాయారు ఉలిక్కిపడింది. అలా గుడ్లప్పగించి చూస్తుండిపోయింది.

"నువ్వేం బాధపడకు. ఆరు నెలల్లో మళ్ళీ నీకు పుస్తెలు చేయించే పూచీ నాది..."

"ఏం వ్యాపారం చేద్దామనుకుంటున్నారు...!" మంగతాయారు కష్టంగా గొంతు పెగుల్చుకుంటూ అడిగింది.

"వాయిదాల పద్ధతి మీద గుడ్డలు, మంచాలు, కంచాలు, బిందెలు మురికివాడల్లో ఇద్దాం. అంతేకదా- వాళ్ళకేదన్నా అవసరాలు వచ్చినప్పుడు వస్తువులు కుదువ బెట్టుకునే వ్యాపారం కూడా చేద్దాం...!"

"నష్టమొస్తే...!"

"ఏముంది...? కట్టుబట్టలతో వచ్చిన వాళ్ళం. కట్టు బట్టలతో ఈ వూరు నుంచి వెళదాం. పోతే పుస్తె లేగా పోయేది? నీ మొగుడు నీ కెదురుగా పిడిరాయిలా వున్నప్పుడు పుస్తెలు లేకపోతేనేం...?"

"ఇవి అమ్మితే ఎంతొస్తాయి...?" మెళ్ళోవున్న పుస్తెల్ని తడుముకుంటూ చాలా సేపాగి అడిగింది మంగతాయారు.

"మహా అయితే రెండు వేలొస్తాయేమో...!"

"అయితే ఒక పనిచేద్దాం...! నాకున్న రెండు పుస్తెల్లో ఒకటి అమ్ముదాం. వెయ్యి రూపాయిలతో వ్యాపారం ప్రారంభిద్దాం. నష్టమొచ్చినా నాకు ఒక పుస్తె మిగిలుంటుంది. ప్రాణం మీదికేమైనా వొచ్చినప్పుడు. అది కూడా లేకపోతే ఏమైపోతాం...?" అంది.

మంగతాయారు మాటల్లో లాజిక్ నచ్చింది గంగరాజుకి. అంతేకాదు ఆమె మాటల్లో నిజం కూడా వున్నట్టనిపించింది. సరేనని తలూపాడు. భార్య ఇచ్చిన ఒక్క పుస్తె తీసుకొని 'రైట్' అంటూ బజార్నపడ్డాడు.

నాలుగు రోజుల తర్వాత 'మంగతాయారు స్కీమ్' పేర మురికివాడల్లో తిరిగే ఓ తోపుడు బండి తయారైంది. ఆ వాడల్లోవాళ్లు బండి మీదున్న సత్తు కంచాలు, స్టీలు చెంబులు, ఇత్తడి బిందెలు- ఒకటేంటి ఆ బండి మీదున్నవి ఏవైనా తీసుకోవచ్చు. రోజుకి మాత్రం రెండు రూపాయిలు కట్టాలి. ఏ ఒక్క రోజైనా చెల్లించకపోతే అది డబుల్ అవుతుంది.

మొదట మంగతాయారు స్కీమ్‌ని ఎవరూపట్టించుకోలేదు. కానీ నెల రోజులు తిరిగేసరికి గంగరాజు బండ్లు రెండయ్యాయి. ఆరు నెలలు గడిచేసరికి ఆరయ్యాయి.






కొనకంచి లక్ష్మీనరసింహారావు

ఏడాది తిరిగేసరికి ఆయన మురికివాడల్లో నిలబడి కౌన్సిలర్‌గా ఎన్నిక కాగల పలుకుబడి సంపాదించాడు.

ఈ వ్యాపారంలో లాభంకన్నా గంగారాజుకిప్పుడు ఆ వ్యాపారం చేయడానికి చిన్నతనమనిపించి బస్టాండ్ పక్కనే వున్న హోటల్‌ని అయిదేళ్ళపాటు లీజ్‌కి తీసుకున్నాడు. లీజ్ కాంట్రాక్ట్ అయిపోయాక 'నేను ఖాళీ చెయ్యను' అని ఆ హోటల్ యజమానిని కోర్టుకు పొమ్మన్నాడు. కోర్టులో కేసు తేలేలోగా ఆ హోటల్ అసలు యజమాని హరీ మన్నాడు.

ఆయన పోగానే వారసులకి మధ్యవర్తుల ద్వారా రాయబారాలు పంపాడు. మార్కెట్ రేటు కన్నా పది రూపాయిలు ఎక్కువిస్తా హోటల్ వదిలెయ్యమని. సామ, దాన, భేదోపాయాలన్నీ ప్రయోగించి ఆ హోటల్‌ని తన పేర మార్పించుకొని గంగరాజు గారు అయిపోయేడు.

ఆ హోటల్ రెండంతస్తుల బిల్డింగ్. పై భాగంలో గంగరాజు కుటుంబం వుండేది. కింది భాగంలో హోటల్. ఆ హోటల్ ఎప్పుడూ కిటకిటలాడుతూ వుండేది.



ఆ హోటల్‌లో ఇరవై మందిదాకా సప్లయర్లు పని చేస్తుండేవారు. అందులో ఒకడి పేరు సుందరం. సుంధరం కేరళ నుంచి బతుకు తెరువుకోసం ఆంధ్ర ప్రదేశ్ వచ్చాడు.

వచ్చేటప్పుడు చిలక జ్యోతిష్కుడిని, 'నా జాతకం చూసి ఎలా వుందో చెప్పు' అంటే దివ్యంగా వుంది. నువ్వు రైలెక్కాక ఎక్కడ నిన్ను టి.సి. దించేస్తే అక్కడ సెటిలైపో! అక్కడే నీకు కలిసొస్తుంది' అన్నాట్ట.

కేరళ నుంచి ఆనందంగా వస్తున్న సుందరాన్ని టి.సి. ఈ వూళ్లో దించేయగానే 'ఆహా- ఇదే కాబోలు నేను వెతుకు బతుకుతెరువు పురము' అనుకుంటూ ఆనందంగా దిగిపోయాట్ట.

ఊరంతా తిరిగి ఏం చేయాలో తెలీక సుందరం గంగరాజు హోటల్‌కి వచ్చి 'పనేమన్నా వుందా?' అని అడిగాడు.

అప్పుడు గంగరాజే కౌంటర్ మీదున్నాడు. 'ఏం పని చేస్తావు?' అడిగాడు గంగరాజు.

సుందరం మలయాళంలో ఏదో చెప్పాడు. గంగరాజు తెలుగులో ఏదో అడిగాడు. ఎవరికి ఇద్దరికీ ఏవీ అర్థం కాక, ఏవో సౌంజ్ఞలు చేసుకున్నారు. ఆ రాత్రే పిండి రుబ్బటానికి హోటల్లో దిగిపోయాడు సుందరం.

సుందరంది అదేం జాతకమోగాని చూడగానే ఏ విషయాన్నైనా ఇట్టే పసిగట్టేవాడు. రెండు నెలల్లో తెలుగు పూర్తిగా నేర్చేసుకొని గంగరాజుకి ఎదురుగా నిలబడి 'సార్!' అన్నాడు.

గంగరాజుకి ఓ వీక్‌నెస్ వుంది. అతడు కౌంటర్ ఎక్కగానే ముందుగా కౌంటర్ వెనుక వున్న దేవుళ్ళందరికీ పేరు పేరున మొక్కుకుంటాడు. మొదటి బిల్ తీసుకునేలోపు ఆ హోటల్ సిబ్బంది ఏదడిగినా సరే నంటాడు.

ఈ విషయం సుందరం పసిగట్టి ఆ రోజు ఆయన పూజలయిపోగానే 'సార్' అన్నాడు.

ఏంటన్నట్టు చూశాడు గంగరాజు.

'మీరనుమతిస్తే ఇవాల్టి నుంచి నేను సప్లయర్‌ని అవుతాను. పిండి రుబ్బిరుబ్బి వొళ్ళు హూనమై పోతోంది!' అన్నాడు.

గంగరాజు సరేననటం, సుందరం సప్లయర్ అయిపోవటం వెనువెంటనే జరిగిపోయింది.

అయితే, కథ ఇక్కడే అనుకోని మలుపు తిరిగింది.

గంగరాజుకి ఓ విధవ చెల్లెలు వుంది కదా! ఆమె పేరు పద్మ. ఆమె నిజంగా పద్మంలాగే వుంటుంది. చెంపకి చేరడేసి కళ్ళు, కొంచెం సుఖంగా తిండి దొరుకుతుండటాన నునుపుదేలిన వళ్ళు, తీర్చిదిద్దినట్లుండే రూపం గల ఆమెకు ఐదోతనం లేకపోతేనేం కోర్కెలున్నాయి. కలలున్నాయి. అనుభూతులున్నాయి. వీటన్నిటిని మించి ఆమె మనసు మీద ఇరవై ఏడేళ్ళ వయసు తిరుగుబాటు చేస్తోంది.

ఓ రోజు హడావుడిగా వంటశాలలోంచి మేడం చేతిలో ప్లేట్ నిండా రకరకాల పదార్థాలు తీసుకొని హోటల్‌లో కెళుతున్న సుందరం ఎందుకో తలెత్తి చూశాడు.

మేడ మీద నుంచి తనవైపే పరీక్షగా చూస్తోంది పద్మ.

సుందరం పట్టించుకోలేదు.

పది నిమిషాలాగి మళ్ళీ లోపలికి వచ్చినప్పుడు మళ్లీ యథాలాపంగా పైకి చూశాడు.

పద్మ అలాగే చూస్తోంది తనవైపు.

ఈసారి సుందరం ఆమె చూపుల్ని పట్టించుకున్నాడు. లోపలికొచ్చినప్పుడల్లా పైకి తలెత్తి చూడడం మొదలుపెట్టాడు. పద్మ పనిలేనప్పుడల్లా పిట్టగోడ దగ్గర నిలబడి కిందకు చూడడం మొదలెట్టింది.

ఇద్దరూ చిర్నవ్వుకోవడం, చూపుడు వేలితో మందలించుకోవటం, కొంటెగా వెక్కిరించుకోవటం

విడుదలయింది



ప్రేమ త్యాగాన్ని కోరుతుందంటారు.
కాని,
ప్రాణాన్ని కోరితే!
అదీ
ముక్కు, మొహం
తెలియని మూడవ
వ్యక్తిదైతే!!

సూర్యదేవర రామమోహనరావు
అద్భుతమైన కథకు
టి.వి. ప్రసాద్
అపురూప కథనం

రివెంజ్

వెల: రూ. 24/-



డీలక్స్ పబ్లికేషన్స్
ఏలూర్ రోడ్,
విజయవాడ-2

మొదలుపెట్టారు.

సుందరానికి శనివారం సెలవు. శుక్రవారం హఠాత్తుగా ఆమె 'వదినా రేపు నేను వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్ళి పూజ చేయించొస్తా!' అంది పెద్దగా! అది సుందరం విని సంకేతాన్ని అర్థం చేసుకున్నాడు. ఆ రాత్రి అతనికి ముద్ద గొంతు దిగలేదు. కంటి మీదకు కునుకు రాలేదు.

పద్మకు కూడా అలాగే వుంది.

తెల్లవారి సుందరం చకచకా అల్లుకుపోయాడు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశాక 'ఇప్పుడు మనం ఎన్ని అడుగులు నడిచామంటారు?' అడిగాడు.

పద్మ మౌనంగా వుండిపోయింది. ఆమెకు చాలా భయంగా వుంది. తను పెళ్ళికానిది కాదు. పెళ్ళైంది. ఆ ఆనందమూ పోయింది. అందుకే ఆ భయం. కానీ ఆ భయాన్ని ఏదో తెగింపు మింగేసింది.

తప్పుకు, ఒప్పుకు మధ్య వున్నది చాలా చిన్న రేఖ. తప్పు అని తెలుసుకున్న మనిషి ఆ తప్పు చేస్తాడు. ఒక్కసారి దాని ఫలితాన్ని అనుభవించటానికి బతుకునే బలి పెట్టాల్సొస్తుంది.

ప్రస్తుతం ఆమె చేస్తున్నది అదే.

పద్మ మాట్లాడకపోవడం చూసి తన మాటల వేగం పెంచాడు సుందరం. "ఇప్పుడు మనం డెబ్బై అడుగులు నడిచాం! అంటే పదిసార్లు ఏడడుగులు నడిచామన్న మాట!"

"మీ నుదుటన సింధూరం వుంటే ఎంత అందంగా వుంటారు" అన్నాడు. "బురదలో వున్నా పద్మం పద్మమే కదా!" అన్నాడు. చివరికి ధైర్యం చేసి 'మీరు సరేనంటే మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటా' అన్నాడు.

ఈ మాటలన్నిటిలో ఆమె మీద అతి బలంగా పనిచేసింది 'పెళ్ళి' అన్న పదం ఒక్కటే.

ఆ ఒక్క పదం ఆమెని ఎంతగా ప్రభావితం చేసిందంటే, రెండు నెలల తర్వాత ఆమె వాంతులు చేసుకుంది.

ఈ విషయం తెలియగానే గంగరాజు హోటల్ దద్దరిల్లేలా "ఒరే సుందరం' అని పెద్దగా అరిచాడు.

సుందరం అంతకు పది నిమిషాలముందే ట్రెయినెక్కేశాడు.

గంగరాజుకిప్పుడు పరువు ముఖ్యం. తన విధవ చెల్లెలు కడుపుతో వుందంటే లోకమంతా ముఖాన వూస్తుంది. ఇదివరకటిలా తను అనామకుడు కాదు. తనకూ పరువుంది. హోదా వుంది. గుర్తింపు వుంది.

ఏం జరిగిందో ఏమో- తెల్లారి పద్మ శరీరం బావిలో తేలి కనిపించింది.

ఇదంతా గంగారాజుగారు డబ్బు విచ్చేవలెక్కుతున్న తొలి రోజుల్లో జరిగింది. ఇప్పుడు ఆయన చాలా మెట్లెక్కేశాడు. ఇప్పుడాయన హాయిగా విశ్రాంతి తీసుకున్నా ఫరవాలేదు. పది తరాలకు సరిపడా ఆస్తిపాస్తులు సంపాదించాడు.

అలా ఆయన క్రిష్ణా... రామా అనుకుందామనుకుంటుండగా ఓ పెద్ద దారుణం జరిగిపోయింది.

గంగరాజు అల్లుడు డాక్టర్ శ్రీధర్ ఓ రోజు 'దమయంతిని బరబరా ఈడ్చుకుంటూ వచ్చి గంగరాజు కాళ్ళ మీద పడేసి "మీరే చెప్పండి మామగారూ... న్యాయం..." అన్నాడు.

"ఏం జరిగింది?"

"దాన్నే అడగండి..."

గంగరాజు కూతురు వైపు చూశాడు. చెంపల మీద వాతలు కనపడుతున్నాయి. ఏదో జరగకూడనిదే జరిగి వుంటుందని ఊహించాడు.

శ్రీధర్ చెప్పాడు "నా హాస్పిటల్‌లో కంపౌండర్ ఒకడున్నాడు. వాడికి, దీనికి ఎన్నాళ్ళ నుంచి జరుగుతుందో వ్యవహారం. ఇవాళ నా బెడ్ రూంలో ఇద్దరు ప్రత్యక్షంగా పట్టుబడ్డారు."

గంగరాజు హతాశుడయ్యాడు. వెంటనే లేచి శ్రీధర్ చేతులు పట్టుకున్నాడు. ఇవి చేతులు కావు కాళ్ళు అన్నాడు. ఈ విషయం బయటికొస్తే నా పరువు పోతుందన్నాడు. ఎంత డబ్బు కావాలన్నా ఇస్తానన్నాడు. ఈ విషయం మర్చిపోతే ఉభయులకు మంచిదన్నాడు.

అన్నీ విని శ్రీధర్ ఒక్కటే చెప్పాడు. "మీ పరువు పోకుండా వుండాలంటే, ఐ మీన్ ఈ విషయం ఎవరికి తెలియకుండా వుండాలంటే ఒక్కటే మార్గం."

"ఏంటది?"

"విడాకులు" అని అక్కడ్నించి గబగబా వెళ్ళిపోయాడు. గంగరాజు కూతురు వైపు చూశాడు. దమయంతి తల దించుకొని ఏడుస్తోంది. ఆయనకెందుకో హఠాత్తుగా చెల్లెలు పద్మ గుర్తుకొచ్చింది. అప్పుడు అది కూడా ఇలాగే ఆ రోజు ఏడుస్తూ నిలబడింది.

తను ఏం చేశాడు...?

పద్మని వెంటబెట్టుకొని బావి దగ్గరకు తీసుకువెళ్ళి 'దూకు' అన్నాడు. ప్రాణ భయంతో ఆమె విలవిలలాడుతుంటే తనే ఎత్తి బావిలో పడేశాడు.

ఇప్పుడు తను కూతురు విషయంలో కూడా అదే చేయగలడా? ఇది కూడా పరువు సమస్యే కదా! అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుంటూ అన్నాడు. అది కూడా చాలా సేపటి తరువాత. "అమ్మాయ్... విడాకులు తీసుకో! నీకు మళ్ళీ పెళ్ళి చేస్తాను!"

ఆ రాత్రి ఎవరికీ తెలియకుండా గంగరాజు శ్మశానానికి వెళ్ళి చాలా సంవత్సరాల క్రితం పద్మని దహనం చేసిన చోట నిలబడి భోరుమన్నాడు. ◆

### చీకటి విలువ

డిక్టేషన్ ఇస్తున్నాడు బాస్. అప్పటికే రాత్రి ఏడు గంటలయింది. వాళ్ళిద్దరూ తప్ప అంతా వెళ్ళిపోయారు.

టైపిస్టు తొందర పడుతోంది... వెళ్ళాలంటూ.

సడన్‌గా కరెంటు పోయింది.

ఇదే ఛాన్సనుకుని బాస్ టైపిస్ట్ తలని తన రెండు చేతులతో దగ్గిరకి తీసుకుని ఆమె బుగ్గల మీద చుప్...చుప్...చుంబించాడు ఎడతెగకుండా.

ఇంతలో కరెంటు వచ్చేసింది.

"నా మీద కోపం లేదుకదూ?" అన్నాడు బాస్ కొంటెగా నవ్వుతూ.

"ఆ సంగతలా వుంచండి. జేబులో మరో అయిదు వందలే వేసుకొస్తే ఎలా బాస్?" అంది టైపిస్టు చిలిపిగా.